సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 23 | జనవరి | 2024



దళారులను ఆశ్రయించకండి

మెడికల్ బోర్డు దరఖాస్తుదారులు దళారులను ఆశ్రయించొద్దని సింగరేణి సీఎండీ సూచించారు. 12లో



ఏదీ యాంత్రీకరణ?

కొన్నేళ్లుగా పాలకులు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించక, రైతులు ఇబ్బంది పడుతున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 18°

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గణిత ప్రతిభా పరీక్ష



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 23 మండలాల నుంచి 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో బహుమతులు సాధించారు. వీరిలో సుజాతనగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి వై.ప్రణయ్, పాల్వంచ మండలం బొల్లోరిగూడెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి డి.హాశ్వీత్, భద్రాచలం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఇ.రమ్య ఉన్నారు. తెలుగు మాధ్యమం నుంచి జి.సుమంత్, స్పందన, ఆషీకాలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో ఏసీజీఈ మాధవరావు, ఎంఈఓ జుంకీలాల్, సింగరేణి పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలినడకన ద్వారకా తిరుమలకు..



కాలినడకన వెళ్తున్న భక్తులు

అశ్వారావుపేటరూరల్: అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కొందరు భక్తులు ఏపీలోని ఏలూరు జిల్లాలోని ద్వారకా తిరుమలకు పాదయాత్రగా తరలి వెళ్లారు. సోమవారం రాత్రి అశ్వారావుపేటలోని రామాలయం నుంచి బయల్దేరిన వీరు ముందుగా శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకొని అక్కడ స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం అక్కడి నుంచి ద్వారకా తిరుమల కాలినడకన చేరుకుంటారు. కాలినడకన వెళ్లిన వారిలో యశోద యుగంధర్, జల్లిపల్లి అరవింద్, తోకల కిరణ్, తోకల సురేష్, చిట్లూరి హరినాథ్, జల్లిపల్లి రాజా ఉన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి

కొత్తగూడెంటౌన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు రెండో రోజుతో ముగిశాయి. సోమవారం రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ క్రీడా ప్రాంగణంలో ఖోఖో, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి ప్రారంభించి మాట్లాడారు. న్యాయవాదులు, ఉద్యోగులు నిత్యం ఎదుర్కొనే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి. రామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, దుంద్ర రమేష్, రావిలాల రామారావు, కాసాని రమేష్, పిట్టల రామారావు, యుగంధర్, మనోరమ, న్యాయవాదులు, ఉద్యోగులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి




విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరాచారి సూచించారు. సోమవారం రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్ర సమయాల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్టులు నిర్వహించడంపై అభినందించారు.

‘నామినేటెడ్’ ఆశలు

పదవుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం

- ఆది నుంచి కాంగ్రెస్‌కు అండగా భద్రాద్రి జిల్లా
- కష్టకాలంలోనూ పార్టీని నమ్ముకుని ఉన్న నేతలు
- నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యమివ్వాలని విన్నపాలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇప్పటికే రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. తాజాగా నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశం తెరమీదకు రావడంతో మరింత ఉత్సాహం కనిపిస్తోంది. ఇన్నాళ్లు పార్టీ కోసం పని చేసిన తమకు గుర్తింపు దక్కే సమయం వచ్చిందనే భావనలో హస్తం నేతలు ఉన్నారు. మరికొందరు నామినేటెడ్ పోస్టుల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ పార్టీ పెద్దలను కలుస్తున్నారు.

పదేళ్ల తర్వాత అధికారంలోకి..

తెలంగాణ ఏర్పడ్డాక రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ అటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇటు కొత్తగా ఏర్పాటైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో బలంగానే ఉంది. శాసనసభకు 2014, 2018లలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అయితే ఆ తర్వాత కాలంలో హస్తం గుర్తుపై గెలిచిన నేతలు ‘కారు’లోకి వెళ్లిపోయారు. అయినా కాంగ్రెస్‌కు సంస్థాగతంగా ఉన్న బలం చెక్కుచెదరలేదు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా కనిపించినా పార్టీ కోసం అండగా నిలబడే నాయకులు లేకుండా పోయారు. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ జిల్లా వ్యాప్తంగా అనేక మంది నాయకులు కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని ఉండిపోయారు. రాజకీయ భవిష్యత్‌పై పెద్దగా అంచనాలు లేకపోయినా పార్టీని వీడలేదు. చివరకు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం పాలైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ శ్రేణులకు పరిపాలనలో భాగస్వాములు అయ్యేందుకు అవకాశం వచ్చింది.

దృష్టి సారించిన సీఎం రేవంత్‌రెడ్డి

అధికారంలోకి వచ్చిన తొలి నెలలో ఆరు గ్యారెంటీల హామీ, మంత్రివర్గం ఏర్పాటు తదితర అంశాలకే అధికంగా ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో జిల్లా స్థాయి మొదలు రాష్ట్రస్థాయి వరకు నామినేటెడ్ పోస్టుల భర్తీ వ్యవహారాన్ని పక్కన పెట్టారు. సంక్రాంతి పండగకు ముందే నామినేటెడ్ పోస్టులపై కదలిక వచ్చినా సీఎం రేవంత్ రెడ్డి దావోస్ (స్విట్జర్లాండ్) పర్యటన కారణంగా మరోసారి వాయిదా పడింది. అయితే విదేశీ పర్యటనలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే కేబినెట్ ర్యాంకు హోదాతో ప్రభుత్వ సలహాదారులు నియామకాలు జరిగాయి. దీంతో నామినేటెడ్ పోస్టుల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని భద్రాద్రి జిల్లా హస్తం నేతలు కోరుతున్నారు.

కొత్తగూడెం నుంచి నాగా, పోట్ల

జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా నాలుగు చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేటలలో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేలు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. పొత్తులో భాగంగా కొత్తగూడెం సీటును సీపీఐకి కేటాయించారు. ఫలితంగా ఏడాది కాలంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న నాగా సీతారాములు, పోట్ల నాగేశ్వరరావులకు పోటీ చేసే అవకాశం రాలేదు. అయినప్పటికీ గ్రూపు రాజకీయాలకు తెర తీయకుండా, సీపీఐ అభ్యర్థి గెలుపు కోసం ఐక్యంగా శ్రమించారు. దీంతో ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల భర్తీలో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు నాగా సీతారాములు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిసి వివరించారు.

పొదెంను గుర్తించండి

అనూహ్య పరిస్థితుల మధ్య 2018లో భద్రాచలం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పొదెం వీరయ్య గెలుపొందారు. ఆ టర్మ్‌లో జిల్లాలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో పొదెం మినహా మిగిలినవారు పార్టీని వీడారు. పొదెం వీరయ్య ఒక్కరే పార్టీని అంటిపెట్టుకుని ఉండటంతోపాటు డీసీసీ అధ్యక్షుడిగా కష్టకాలంలో పార్టీని ముందుకు నడిపించారు. అయితే గత నవంబరు 30న జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. కష్టకాలంలో ఎన్ని ఒత్తిడులు, ప్రలోభాలు ఎదురైనా పార్టీకి విధేయుడిగా ఉన్న పొదెం వీరయ్యను శాసన మండలికి పంపాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కుదరని పక్షంలో నామినేటెడ్ పోస్టుల్లో అయినా పొదెంకు అవకాశం కల్పించాలని ఆయన మద్దతుదారులు డిమాండ్ చేస్తున్నారు.

అందని సూపర్ స్పెషాలిటీ సేవలు

సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల కొరత

కొత్తగూడెంరూరల్: సూపర్ స్పెషలిస్టులు లేక జిల్లా సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందడంలేదు. జిల్లా ఏజెన్సీ ప్రాంతం కావడంతోపాటు సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్, నవభారత్ వంటి పరిశ్రమలను కూడా కలిగి ఉంది. కానీ ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో లేరు. సింగరేణి, ఆస్పత్రి, సర్వజన ఆస్పత్రిలో కార్డియాలజిస్టు ఒకరు కూడా లేరు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా రెగ్యులర్ కార్డియాలజిస్టు లేరు. వారానికి ఒకటి, రెండు రోజులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఓపీ సేవలందిస్తారు. ఎవరికైనా గుండెపోటు వంటి అత్యవసర సమస్య వస్తే, ఖమ్మం, హైదరాబాద్ ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తోంది. దీంతో సకాలంలో వైద్యం అందక కొందరి ప్రాణాలు పోతున్నాయి. జిల్లాలో పలువురు షుగర్, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. సరైన సమయంలో వైద్య సేవలు అందకపోవడం వల్ల కిడ్నీలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. దీంతో డయాలసిస్ చేసుకునే వారు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే స్తోమత లేక పలువురు ఇబ్బంది పడుతున్నారు.



జిల్లా సర్వజన ఆస్పత్రి

నిపుణుల నియామకం ఎప్పుడో.. ?

జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో 350 పడకలు ఉన్నాయి. ఇక్కడ 12 మంది ప్రొఫెసర్లు, 47 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 38 మంది సీనియర్ రెసిడెంట్లు ఉన్నారు. జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఉండగా, ప్రస్తుతం 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా ఆస్పత్రిలో న్యూరో సర్జన్, కార్డియాలజిస్టు, డెర్మటాలజిస్ట్, యూరాలజిస్ట్, నెఫ్రాలాజిస్ట్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, ప్లాస్టిక్ సర్జన్ తదితర ప్రత్యేక వైద్య నిపుణుల కొరత ఉంది. వీరి నియామకం ఎప్పుడు జరుగుతుంతో తెలియని పరిస్థితి నెలకొంది. పూర్తిగా ఏజెన్సీ జిల్లా కావటంతో కార్పొరేట్ ఆస్పత్రులు ఇక్కడ ఏర్పాటు కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు సూపర్ స్పెషాలిటీ వైద్యుల నియామానికి కృషి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

పాల్వంచ: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బి.రోహిత్‌రాజు సూచించారు. సోమవారం ఆయన పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులను, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కేసులు ఎప్పటికప్పుడు నమోదు చేసి పరిష్కరించాలన్నారు. డీఎస్పీ వెంకటేశ్, పట్టణ ఎస్ఐ బి.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ప్రజాప్రతినిధులు, అధికారులు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 57 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రఘునాథపాలెం: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 57 మందికి సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి విజయకుమారి, ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ ప్రియాంక, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ ఎల్.విల్సన్, సర్పంచ్ దేవుసింగ్‌తో పాటు జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో అవినీతిపై విచారణ

రఘునాథపాలెం మండలంలో అసంపూర్తి నిలిచిపోయిన అభివృద్ధి పనులపై నివేదిక సమర్పించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం తహసీల్‌లో సోమవారం ఆయన అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. శాఖల వారీగా మంజూరైన పనులు, నిధులు, అసంపూర్తిగా ఆగిపోవడానికి కారణాలపై నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే, పోడు పట్టాలు అందుకున్న రైతులు బోర్లు వేయించుకునేందుకు అనుమతించాలని సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వ భూముల్లో పేదలకు పట్టాలు ఇచ్చిన చోట నివాసముంటున్నారా, లేదా అని విచారణ జరపాలని తెలిపారు. ఇక మండలంలోని మూడు సొసైటీల విషయంలో అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా సహకార అధికారి విజయకుమారి, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్యాం ప్రసాద్, ఎంపీపీ గౌరి, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ విల్సన్, సీడీపీఓ కవిత, ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఏడీఏ శ్రీనివాస్, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంలో అంబేద్కర్ సెంటర్ వద్ద శోభాయాత్ర

మార్మోగిన రామనామం

- భద్రగిరి పురవీధుల్లో ఊరేగిన రామయ్య
- శోభాయాత్రతో ఆధ్యాత్మిక సందడి
- ముత్తంగి అలంకరణలో మెరిసిన శ్రీ సీతారామ చంద్రస్వామివారు



బేడా మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారు

భద్రాచలం: అయోధ్యలోని రామమందిరంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దక్షిణ అయోధ్యలో సంబురాలు అంబురాన్నంటాయి. శ్రీరామ నామస్మరణ, రాముడి చిత్రపటంతో కూడిన కాషాయ జెండాలతో భద్రగిరిలో ఆధ్యాత్మిక పండుగ వాతావరణం వెల్లివిరిసింది. ప్రచార రథంతో పురవీధుల్లో తిరుగాడిన రామయ్యకు భక్తులు, స్థానికులు బ్రహ్మరథం పట్టారు. సీతాలక్ష్మణ, ఆంజనేయ వేషాలలో సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారి కళాకారులు అబ్బురపరిచారు.

దేవస్థానంలో ప్రత్యేక పూజలు

బలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో సంక్షేప రామాయణ హవనం, అభయాంజనేయస్వామి ఉపాలయంలో సుందరకాండ పారాయణం నిర్వహించారు. బేడా మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని కొలువుదీర్చి సువర్ణ పుష్పార్చన పూజలను ప్రత్యేకంగా జరిపారు. సాయంత్రం భక్తి శ్రద్ధలతో దీపోత్సవం నిర్వహించారు. భక్తులకు ప్రసాదంగా బెల్లం పొంగలిని అందచేశారు.

శోభాయాత్రకు బ్రహ్మరథం

విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భద్రాచలం పురవీధుల్లో రామయ్య ప్రచార రథంతో చేపట్టిన శోభాయాత్రకు భక్తులు, స్థానికులు బ్రహ్మరథం పట్టారు. మహిళలు కోలాటాలు, డప్పు వాయిద్యాలు, ఆస్థాన విద్వాంసుల రామకీర్తనలతో భద్రగిరిలో పండుగ సంతరించుకుంది. శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య ఉత్సవ మూర్తులు పూజల నడుమ ఇళ్ల ముందుకు రావడంతో భక్తులు పరవశించి మొక్కులు తీర్చుకున్నారు. సబ్ కలెక్టరేట్, అంబేద్కర్ సెంటర్ల మీదుగా ఈ యాత్ర సాగింది. యాత్రలో సీతాలక్ష్మణ, ఆంజనేయ వేషాలతో ఉన్న చిన్నారులతో ఫొటోలు దిగేందుకు ప్రజలు పోటీ పడ్డారు. దేవస్థానం ఈఓ రమాదేవి యాత్రను పర్యవేక్షించగా, సీఆర్‌పీఎఫ్, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని, ఉపాలయాలను, ధ్వజస్తంభాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, స్థానాచార్యులు స్థలశాయి, ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, ఈఈ రవీందర్, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

‘వెండి రామయ్య’కు పూజలు

హైదరాబాద్‌కు చెందిన అనురాధ, డాక్టర్ ఎర్రం పూర్ణశాంతి గుప్తాలు వెండి సీతారాముల విగ్రహాలను తయారు చేయించి బహూకరించారు. ఈఓ రమాదేవి వారిని ప్రత్యేకంగా అభినందించారు. భద్రగిరి రామయ్య సోమవారం ఆలయంలో ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. బేడా మండపంలో స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా సాగింది.

చిత్రమాలిక 11లో..

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

దుమ్ముగూడెం : పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య సూచించారు. సోమవారం మండలంలోని ములకపాడు గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకునేలా ఇప్పటి నుంచే గ్రామ కమిటీలను పూర్తి చేయాలన్నారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లంక అబ్బులు ఆధ్వర్యంలో పొదెం వీరయ్యకు ఎమ్మెల్సీ ఇచ్చి, కేబినెట్ హోదా కల్పించాలని తీర్మానం చేశారు. టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, నాయకులు శిరపు అప్పల రెడ్డి, జువాల వేమన రెడ్డి, పిలక వెంకటరమణారెడ్డి, మందపాటి అప్పిరెడ్డి, దర్శి సాంబశివరావు, అన్నె నారాయణమూర్తి, రాజా రెడ్డి, కనుబుద్ది దేవా, సోడి చలపతి, లంక శివ, టి. హరికృష్ణ, టి. సంగీతరావు, వి. వెంకటేశ్వరావు, పి.సూర్యచంద్రరావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్ ప్రియాంక ఆల



దరఖాస్తుదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెంఅర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలు అడిగి సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న ప్రజావాణికి జిల్లా నుంచి 144 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వీటిపై నోటీసులు జారీ చేసి ఏడు రోజుల్లోగా విచారణ పూర్తి చేసిన నివేదికలు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, డీఆర్ఓ రవీంద్రనాథ్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని ఇలా...

- రెడ్డిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో తనను టీచర్‌గా నియమించాలని ఇల్లెందులపాడు అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు నునావత్ జ్యోతి దరఖాస్తు అందించగా, మహిళా సంక్షేమ అధికారికి ఎండార్స్ చేశారు.
- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పాత పాల్వంచకు చెందిన ఎండి.మెహమూదా బేగం అర్జీ అందించగా, దరఖాస్తును డీఆర్వోకు ఎండార్స్ చేశారు.
- హేమచంద్రాపురంలోని తన పొలానికి వెళ్లే దారిని బుర్ర నాగస్వామి, బుర్ర రాములు, చెట్టుకూరి అశోక్ అనే వ్యక్తులు ఆక్రమించారని కొత్తగూడెం నేతాజీ మార్కెట్ ప్రాంతానికి చెందిన బోటుక భారతి పేర్కొన్నారు. గతంలో ఇదే విషయమై కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా , సర్వేయర్‌ను విచారణకు ఆదేశించారని, కానీ సర్వేయర్ ఇప్పటివరకు కలెక్టర్‌కు నివేదిక ఇవ్వలేదని తెలిపారు. పొలానికి వెళ్లకుండా వేసిన కంచెను తొలగించి న్యాయం చేయాలని కోరగా.. దరఖాస్తును కొత్తగూడెం ఆర్డీఓకు రిఫర్ చేశారు.
- మణుగూరు మండలం రామానుజవరం పరిధిలోని సర్వే నంబర్ 976లో అక్రమంగా ఇసుక దందా చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని పూనెం రమేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఇసుక తరలింపునకు అనుమతిపై సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరగా.. అరకొర సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. ఈ దరఖాస్తును కలెక్టర్ మైనింగ్ ఏడీకి ఎండార్స్ చేశారు.
- సీతమ్మ సాగర్ నిర్మాణానికి తేగడ, గొమ్ముగూడెం, లింగాల, ముమ్మిడివరం, జట్టిగూడెం, కుదునూరు గ్రామాల్లో తీసుకుంటున్న భూమికి ఎకరాకు రూ.30 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని భూనిర్వాసితులు అర్జీ పెట్టుకున్నారు. దరఖాస్తును కలెక్టర్ భద్రాచలం ఆర్డీఓకు ఎండార్స్ చేశారు.
- కేటీపీఎస్ యాష్‌పాండ్ బూడిద వల్ల తన పొలం పంటల సాగుకు పనికిరాకుండా పోయిందని పాల్వంచ మండలం పునుకుల గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు తెలిపారు. కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామని, కేటీపీఎస్‌లో ఉపాధి కల్పించి న్యాయం చేయాలని దరఖాస్తు పెట్టుకోగా, దరఖాస్తును పాల్వంచ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.

క్లుప్తంగా

రామాలయంలో అంతర్గత బదిలీలు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగుల అంతర్గత బదిలీలు చేపట్టారు. ఈ మేరకు ఈఓ రమాదేవి సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. భద్రాచలంలో ఏఈఓగా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌కు పర్ణశాలలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. అలాగే, ఈఓ సీసీ, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావుకు మేజర్ ఫెస్టివల్ ఎస్టాబ్లిష్‌మెంట్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డికి గోశాల, భూములు, లీజులు, లైసెన్సుల బాధ్యతలు అదనంగా కేటాయించారు. ఇంకా రాకేశ్‌కు అకౌంటెంట్, సీఆర్ఓ ఇన్‌చార్జ్‌గా, రికార్డు అసిస్టెంట్ కుమారికి వార్షికోత్సవాలు, శ్రీరామదీక్ష, ట్రస్టు బోర్డు బాధ్యతలు, రికార్డు అసిస్టెంట్ జ్యోతికి ప్రీ, పోస్టు ఆడిట్, ఆర్‌టీఐ, ప్రైవేట్ సెక్యూరిటీ బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఏప్రిల్‌లో జరగనున్న శ్రీరామనవమి సందర్భంగా ఈ మార్పులు చేపట్టినట్లు ఈఓ రమాదేవి వెల్లడించారు.

రాముడిని దర్శించుకున్న నాయకులు


ధ్వజస్తంభం వద్ద నమస్కరిస్తున్న వీహెచ్

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారిని సోమవారం పలువురు రాజకీయ నాయకులు దర్శించుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతురావు, బీజేపీ సీనియర్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాలకార్మికుడికి రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రవేశం


రెసిడెన్షియల్ స్కూల్‌లో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థి

అశ్వారావుపేటరూరల్: బాలకార్మికుడిగా పనిచేస్తున్న ఓ విద్యార్థిని సోమవారం రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కుప్పాల యశ్వంత్ కొంతకాలంగా చదువుకు స్వస్తి పలికి ఓ మోటార్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. కాగా, ఇటీవల నిర్వహించిన బడి బయట సర్వేలో సీఆర్పీ సిద్ధాంతపు ప్రభాకరాచారి సదరు విద్యార్థిని గుర్తించగా, హెచ్ఎం హరిత దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థి బడికి వచ్చేందుకు ఆసక్తి చూపగా, కొత్తగూడెంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించారు.

సెల్‌ఫోన్ అప్పగించిన సీఐ


రమణయ్యకు సెల్ ఫోన్ అప్పగిస్తున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెం టౌన్: కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న డ్రైవర్ రమణయ్యకు సోమవారం కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తిరిగి అప్పగించారు. పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో గత అక్టోబర్ 5వ తేదీన ఆర్టీసీ డ్రైవర్ రమణయ్య తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి రామన్నకు తిరిగి అప్పగించారు.

ఎస్ఐ బదిలీ

దమ్మపేట: దమ్మపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవికుమార్ కొత్తగూడెం వన్‌టౌన్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అలాగే, ములకలపల్లి ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి దమ్మపేటకు బదిలీ అయ్యారు. ఎస్పీ రోహిత్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం

కొత్తగూడెంటౌన్: రెండు రోజుల కిందట తప్పిపోయిన బాలుడు రిమాలి ఉషోదయ అక్షయ్‌కుమార్ ఆచూకీ లభ్యమైంది. పాత కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న అశ్వాపురం మండలం చింతిరియాల్‌కు చెందిన అక్షయ్‌కుమార్ 19వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చేపట్టగా సోమవారం ఖమ్మం బస్టాండ్‌లో గుర్తించారు. ఈ మేరకు ఆయనను వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా, చదువుకోవడం ఇష్టం లేకే అక్షయ్ వెళ్లినట్లు అంగీకరించాడని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

ఏదీ యాంత్రీకరణ?

- ఐదేళ్లు అమలుకాని యంత్రలక్ష్మి పథకం
- యంత్ర పరికరాలు లేక సాగుకు ఆటంకాలు
- వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు


పొలంలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్

కరకగూడెం: ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో వ్యవసాయ యాంత్రీకరణ లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామాల్లో దుక్కిటెద్ల స్థానాన్ని ట్రాక్టర్లు ఆక్రమించాయి. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వాడకం పెంచేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ ఐదేళ్లుగా ఈ పథకం అమలు కావడం లేదు. రైతులకు రైతుబంధు పథకం కింద పెట్టుబడి ఇస్తున్నామంటూ గత ప్రభుత్వం ఇతర రాయితీలను రద్దు చేసింది. వ్యవసాయ కూలీల కొరత తీవ్రమవుతుండగా సాగుకు సాయంగా నిలిచే ఆధునిక యంత్రాలను రాయితీపై ఇవ్వకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుండగా యంత్ర పరికరాలు లేనిదే వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడింది.

కొత్త ప్రభుత్వం దృష్టి సారించేనా..

యంత్రలక్ష్మి పథకం ద్వారా రైతులకు ట్రాక్టర్లు, సాగు సామగ్రి, గొర్రు, నాగళ్లు, దమ్ముచక్రాలు, రోటోవేటర్లు, కల్టివేటర్, కేజీవీల్స్, హార్వెస్టర్లు, వరి నాటు యంత్రాలను అందించారు. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, బీసీ రైతులకు 50 శాతం రాయితీ వర్తింపజేశారు. ఇలా మూడేళ్లపాటు ఈ పథకం అమలు చేశాక 2018 నుంచి అమలు చేయడంలేదు. గతంలో ఇచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కాగా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకం కొనసాగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ శాఖ అధికారి చటర్జీని వివరణ కోరగా.. రాయితీతో అందించే యంత్ర పరికరాలపై ఉన్నతాధికారుల నుంచి సమాచారం లేదని తెలిపారు.

రాయితీపై యంత్ర పరికరాలు ఇవ్వాలి



ప్రభుత్వం రాయితీపై యంత్ర పరికరాలు ఇవ్వాలి. ఎన్నిసార్లు అడిగినా ప్రభుత్వం నుంచి రాలేదని అధికారులు చెబుతున్నారు. సాగు పనులకు బయట యంత్రాల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. తక్షణమే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. – పొడెం సమ్మయ్య, రైతు, కొత్తగూడెం

ఎదురుచూస్తున్నాం



గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి రాయితీ పథకాలను పక్కనబెట్టింది. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. నూతనంగా కొలువుదీరిన ప్రభుత్వం యంత్ర పరికరాలు అందించాలి. చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నాం. – పోలేబోయిన నర్సింహారావు, రైతు, వెంకటాపురం

ప్రభుత్వం నుంచి సమాచారం లేదు



యంత్రలక్ష్మి పథకాన్ని గత ప్రభుత్వం 2018 సంవత్సరంలో ఆపింది. దీనిపై కొత్త ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రైతులకు తెలియజేస్తాం. – కొర్సా అభిమన్యుడు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెంఅర్బన్: జిల్లా, బ్లాకుల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్లో జిల్లా, బ్లాకుల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల రూపకల్పన, గణతంత్ర దినోత్సవ వేడుకలు, దిశ కమిటీ సమావేశం తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరుకు స్థానిక సంస్థలు కార్యాచరణ రూపొందించాలని, 29 అంశాలపై జిల్లా నివేదికలు తయారు చేయాల్సి ఉందని చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మహిళా సాధికారిత, సామాజిక న్యాయం, అందరికీ ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా నివేదికలు అందజేయాలని, గ్రామపంచాయతీ ప్రణాళికల పర్యవేక్షణకు డీపీఓ రమాకాంత్, మండల స్థాయి ప్రణాళికల పర్యవేక్షణకు జెడ్పీ సీఈఓను నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. గణతంత్ర వేడుకలపై మాట్లాడుతూ.. ఈ నెల 24వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ నెల 25వ తేదీన ఐడీఓసీలో ఉదయం 10 గంటలకు దిశ కమిటీ సమావేశం నిర్వహిస్తామని, అన్ని శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.మధుసూదన్‌రాజు, డీఆర్ఓ రవీంద్రనాథ్, ఏఎస్పీ విజయబాబు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుపై ప్రచారం

నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన వారు ఓటర్లుగా నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి హరిచందన ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారుల సమావేశం నల్లగొండ కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల గుర్తింపు, కనీస వసతుల కల్పన తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటరుగా నమోదై ఓటుహక్కు వినియోగించుకున్న వారందరూ మళ్లీ వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఫిబ్రవరి 24న ముసాయిదా జాబితా ప్రచురించి, మార్చి 14 వరకు అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. అభ్యంతరాలను పరిష్కరించాక ఏప్రిల్ 4న ఓటరు తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. కాగా, పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను గుర్తించి కనీస వసతులు కల్పించడమే కాక అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్స్‌లపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ హరిచందన ఆదేశించారు.

ఇద్దరు బాలికల అపహరణకు యత్నం!

ఆటోడ్రైవర్, అతడి స్నేహితుడిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఇద్దరు బాలికలను అపహరించేందుకు యత్నించిన ఘటనలో ఓ ఆటోడ్రైవర్‌తోపాటు అతడి స్నేహితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులో వచ్చింది. అదనపు ఎస్ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. ఏపీలోని ఓ మండలానికి చెందిన ఇద్దరు బాలికలు (ఇంటర్ విద్యార్థినులు) శనివారం రాత్రి భద్రాచలం వెళ్లేందుకు అశ్వారావుపేటకు వచ్చారు. కాగా, వీరిలో ఓ బాలిక బంధువు జీలుగుమిల్లిలో ఉండగా, నగదు అవసరం కావడంతో ఫోన్ చేసి అడిగింది. అయితే, అశ్వారావుపేటలో ఆగి ఫోన్ చేస్తే తీసుకొచ్చి ఇస్తానని చెప్పాడు. కానీ రాత్రి 10 గంటలు దాటినా బాలిక బంధువు రాకపోగా, ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందించలేదు. దాంతో ఆ ఇద్దరు బాలికలు ఆర్టీసీ బస్టాండ్ వద్దే గంటల కొద్దీ ఉండిపోయారు. ఈ క్రమంలోనే బాలికలను గమనిస్తున్న ఓ ఆటోడ్రైవర్, అతని స్నేహితుడు వారి వద్దకు వచ్చి రాత్రి కావడంతో ఇబ్బంది పడకుండా తమ ఇంటికి తీసుకెళ్తామని మాయమాటలు చెప్పి ఆటో ఎక్కించుకున్నారు. ఆటో ఎక్కిన తర్వాత వాళ్ల ఇంటికి తీసుకెళ్లకుండా ఖమ్మం మార్గంలోని ఓ ఫ్యాక్టరీ సమీపంలోగల నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లడంతో భయందోళనకు గురై, అక్కడి నుంచి పరుగెత్తుకుంటూ.. ఫ్యాక్టరీ వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డు వద్దకు వచ్చి విషయాన్ని చెప్పారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడికి చేరుకోగా, వారిని గమనించిన ఆటోడ్రైవర్‌తోపాటు స్నేహితుడు పారిపోయారు. బాలికలను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి, తల్లిదండ్రులకు అప్పగించారు. దీనిపై సోమవారం బాధిత బాలికల కుటుంబీకులు చేసిన ఫిర్యాదుపై ఆటోడ్రైవర్, అతడి స్నేహితుడిపై కిడ్నాప్, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న ఆటోడ్రైవర్, అతడి స్నేహితుడి కోసం గాలిస్తున్నట్లు ఆయన చెప్పారు.

గురుకుల కళాశాల విద్యార్థినికి పాముకాటు


విద్యార్థినిని పరామర్శిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వైరా: వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినిని పాటు కాటు వేసింది. కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న కె.ప్రసన్న సోమవారం రాత్రి డైనింగ్ హాల్‌లో భోజనం చేశాక తరగతుల నిమిత్తం వెళ్తుండగా మార్గమధ్యలో పాటు కాటుకు గురైంది. దీంతో తోటి విద్యార్థినులు ఇచ్చిన సమాచారంతో ఉద్యోగులు ఆమెను వైరా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని ఉద్యోగులు తెలిపారు. అయితే, విద్యార్థిని పాటుకాటుకు గురైన సమయాన ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్‌నర్స్ రామలక్ష్మి ఆమెను తీసుకెళ్లి చికిత్స చేయించారు.

ఆరా తీసిన కలెక్టర్

ఖమ్మం మయూరిసెంటర్: పాము కాటుకు గురైన వైరా గురుకులం విద్యార్థిని ప్రసన్నను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా పీడీఎస్‌యూ నాయకులు పరామర్శించారు. అయితే, విషయాన్ని అప్పటివరకు గురుకులం బాధ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లలేదని తెలియడంతో నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వివరాలు ఆరా తీసిన ఆయన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు.

కారు ఢీకొని చిన్నారి మృతి


సిద్ధార్థనాయక్ మృతదేహం

టేకులపల్లి: కారు ఢీకొని మూడేళ్ల బాబు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని కోయగూడెం పంచాయతీ బావోజీతండాకు చెందిన లారీడ్రైవర్ అజ్మీర విక్రమ్‌కు సుజాతనగర్‌కు చెందిన మాధవితో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. వారికి బాబు లక్ష్మణ్, పాప లావణ్య, బాబు సిద్ధార్థనాయక్ (3) ఉన్నారు. సిద్ధార్థనాయక్ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా పక్కనే పార్క్ చేసిన కారును అజ్మీర సుమన్ స్టార్ట్ చేసి చిన్నారిపై ఎక్కించి వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే బాబు మృతి చెందాడని వైద్యులు తెలిపారు. తల్లి మాధవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోయేదేముంది.. ప్రాణాలు తప్ప..


పరిమితికి మించి వెళ్తున్న దృశ్యం

అతివేగం ప్రమాదకరమని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని అధికారులు సూచిస్తున్నా.. వాహనాలపై రాయిస్తున్నా.. మార్పు కనిపించడం లేదు. మండలంలోని మొండికుంట నుంచి మణుగూరు వైపు వెళ్తున్న వాహనంలో పరిమితికి మించి ఎక్కారు. వెనుక భాగంలో చిన్నారులు సైతం నిల్చుని ప్రయాణం చేశారు. ఆ వాహనం కూడా మితిమీరిన వేగంతో దూసుకుపోయింది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. కాగా, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –అశ్వాపురం

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

కరకగూడెం: మండలంలోని కలవలనాగారంలో గుర్తు తెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, కాపర్ వైరును చోరీ చేసిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య రమేశ్ పొలంలో కొందరు రైతులతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని మిర్చి పంట సాగుచేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును చోరీ చేశారు. వైరు విలు రూ.లక్ష వరకు ఉంటుందని కరకగూడెం విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి తెలిపారు. కాగా, కీలక సమయంలో మిర్చి పంటకు నీరుపెట్టాల్సి ఉండగా దుండగులు కాపర్ వైరుతో పాటు త్రీఫేజ్ మోటార్‌ను కూడా ఎత్తుకెళ్లడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజారాం తెలిపారు.

చోరీ కేసులో ఎనిమిది నెలల జైలు

కొత్తగూడెంటౌన్: ఆలయం తలుపులు పగులగొట్టి హుండీ దొంగతనం చేసిన కేసులో పట్టుబడిన మడవి భద్రయ్యకు ఎనిమిది నెలల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జేఎఫ్‌సీఎం జడ్జి సుచరిత సోమవారం తీర్పు వెలువరించారు. గతేడాది జూన్‌లో అన్నపురెడ్డిపల్లి జానకీపురం గ్రామంలో సత్యమ్మగుడి తలుపులు పగులగొట్టి హుండీ చోరీకి గురైందని గుర్తించి అదే గ్రామానికి చెందిన ఇమ్మడి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ ఎస్‌డీ షాహీన విచారణ చేపట్టారు. మడవి భద్రయ్య చోరీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో విచారణ చేపట్టిన సెకండ్ అడిషనల్ జేఎఫ్‌సీఎం జడ్జి సుచరిత సాక్షులను విచారించి భద్రయ్యపై నేరం రుజువు కావడంతో ఎనిమిది నెలల జైలుశిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు.

నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నబండిరేవు గ్రామంలో అక్రమంగా నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ కేశవరావు సోమవారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య సిబ్బందితో కలిసి చిన్నబండిరేవు గ్రామం సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకుని సోదా చేశారు. వారి వద్ద 32 లీటర్ల నాటుసారా దొరకడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సుజ్ఞానపురం గ్రామానికి చెందిన భూక్యా వీరు, భూక్యా శ్రీకాంత్‌లుగా వారిని గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

చెట్టును ఢీకొట్టిన కారు, తప్పిన ప్రమాదం

కారేపల్లి: అదుపుతప్పి ఓ కారు చెట్టును ఢీకొట్టిన ఘటన కారేపల్లిలోని 1కేకే రైల్వే గేట్(పేరుపల్లి) సమీపాన సోమవారం జరిగింది. ఇల్లెందుకు చెందిన కనగాల పేరయ్య కారులో ఖమ్మంవెళ్లి ఇల్లెందుకు బయలుదేరాడు. మార్గమధ్యలో 2కేకే గేట్ మరమ్మతులు జరుగుతుండడంతో పేరుపల్లి గేట్ మీదుగా వస్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో కారు కాల్వలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ఈక్రమాన ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పినట్లయింది.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు


గాయపడిన యువకుడు

టేకులపల్లి: బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఓ యువకుడు గాయపడిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాధారం గ్రామానికి చెందిన భావ్‌సింగ్ సోమవారం కొత్తగూడెం నుంచి ఇల్లెందు వైపునకు బైక్‌పై వెళ్తున్నాడు. తొమ్మిదోమైలు తండా దాటిన తరువాత రోళ్లపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో అతడి తలకు గాయమైంది. స్థానికులు భావ్‌సింగ్‌ను అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు. ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

రాజీకి పిలిచి దాడి.. యువకుడు మృతి

ఖమ్మంక్రైం: గతంలో జరిగిన దాడి విషయమై రాజీకి పిలిచిన వ్యక్తులు ఓ యువకుడిపై దాడి చేయగా ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖమ్మం బీకే బజార్‌కు చెందిన వడ్డేటి శివ(30) పెయింటింగ్ పనితో జీవనం సాగిస్తున్నాడు. గతంలో అదే ప్రాంతానికి చెందిన యువకులతో ఆయనకు గొడవ జరగగా శివ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ కోర్టులో కొనసాగుతోంది. అయితే, కేసు విషయంలో రాజీ కోసం ఆదివారం ఉల్లోజు నాగరాజు సమక్షాన పంచాయతీ నిర్వహించారు. కానీ శివ రాజీపడే ప్రసక్తి లేదని చెప్పడంతో ఆగ్రహానికి గురైన నాగరాజు కర్రతో దాడికి చేయగా ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న శివ సోమవారం మృతి చెందాడు. ఘటనపై మృతుడి తండ్రి వడ్డేటి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ స్వామి తెలిపారు.

రూ.86 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: వైరాకు చెందిన తిరుమల ఇంజనీరింగ్ యజమాని కొల్లి తిరుమలరావు రూ.86లక్షలకు గాను ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేశారు. వైరాలో తిరుమల ఇంజనీరింగ్ పేరుతో ట్రాక్టర్ల మరమ్మతు, వ్యవసాయ పరికరాల తయారీ, అమ్మకం చేస్తున్న ఆయన 13 మంది నుంచి రూ.86 మేర అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చలేని పరిస్థితి ఉందని చెబుతూ న్యాయవాదులు చింతనిప్పు వెంకట్, సాయిరాజీవ్ ద్వారా దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

యువకుడి ఆత్మహత్య..

అశ్వాపురం: మండలంలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలోని రామవరం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు బండ నాగేంద్రబాబు(22) సోమవారం సాయంత్రం పురుగులమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతికి కారణాలు తెలియలేదు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



హైకోర్టులో ప్రత్యేక పూజలు

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో భవ్య మందిర నిర్మాణం, రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్(హెచ్‌సీఏఏ) ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఇందులో దాదాపు 2 వేల మంది పాల్గొన్నారని, హైకోర్టు చరిత్రలో ఇంతమందితో కార్యక్రమం జరగడం ఇదే ప్రథమమని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు చెంగల్వ పేర్కొన్నారు. కల్యాణ్‌రావు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు సూర్యకరణ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి పులి దేవేందర్, బైరెడ్డి శ్రీనివాస్, పూర్ణశ్రీ, శారద, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి వేలమంది

ఏపీలో సమ్మె విరమణ దిశగా అంగన్‌వాడీల అడుగులు

- ఫలిస్తున్న ప్రభుత్వ సామరస్య పూర్వక యత్నాలు
- పేదలకు పౌష్టికాహారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బంది పడకుండా చర్యలు
- రాజకీయ శక్తుల చేతుల్లోకి ఉద్యమం.. 'చలో' భగ్నం



సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నించిన పార్టీల కబంధ హస్తాల నుంచి అంగన్‌వాడీలు బయటపడుతున్నారు. పునరాలోచనలో పడ్డ అంగన్‌వాడీలు సమ్మె బాట వీడి విధుల్లోకి చేరుతున్నారు. రెండు రోజులుగా రాష్ట్రంలో దాదాపు 32 వేల మంది అంగన్‌వాడీలు విధుల్లోకి చేరినట్లు సమాచారం. రానున్న రెండు రోజుల్లో మరింత మంది విధుల్లోకి రానుండటంతో విపక్షాల రాజకీయ క్రీడకు తెర పడనుంది. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 42 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సంయమనం పాటించింది. వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించి ఇప్పటికే మూడు దఫాలు చర్చలు జరిపింది. వారు ప్రస్తావించిన అన్ని సమస్యలను పరిష్కరించి వాటి అమలుకు చర్యలు చేపట్టింది. కేవలం ఒక్క డిమాండ్ వేతన పెంపుపై ప్రభుత్వం కొంత సమయం కోరింది.

స్పాన్సర్డ్ శిబిరాలు..

అంగన్‌వాడీల పేరుతో రాజకీయ పార్టీలకు చెందిన యూనియన్లు సమ్మె శిబిరాలను నిర్వహిస్తున్నాయి. పలు చోట్ల టీడీపీ నేతలు వీటిని స్పాన్సర్ చేస్తున్నారు. టెంట్లు, కుర్చీలు, భోజనాలు సమకూరుస్తూ కొన్ని శక్తులను ఆందోళనకు పురిగొల్పుతున్నారు. అంగన్‌వాడీల ముసుగులో అసాంఘిక శక్తులు ఉద్రిక్తతలు, హింసను ప్రేరేపించేలా అరాచకంగా వ్యవహరిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అంగన్‌వాడీల పేరుతో రాజకీయ లబ్ధి కోసం కొన్ని పార్టీలు సోమవారం 'ఛలో విజయవాడ'కు పిలుపునిచ్చాయి. శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు జరుగుతున్న కుట్రలను ముందుగానే గుర్తించిన నిఘా వర్గాలు హెచ్చరించడంతో పోలీసులు ఈ కార్యక్రమాన్ని భగ్నం చేశారు. అసాంఘిక శక్తుల ఉచ్చులో చిక్కుకుంటే ఇబ్బందులు తప్పవని అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చారు.

ఇటు ఆహ్వానం.. అటు ప్రత్యామ్నాయం

అంగన్‌వాడీల సమస్యలపై సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం మరోవైపు ప్రత్యామ్నాయ చర్యలపై కూడా దృష్టి సారించింది. విధుల్లో చేరిన వారిని కొనసాగిస్తూ ఇతర చోట్ల పేదలకు ఇబ్బందులు ఎదురు కాకుండా కలెక్టర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విధుల్లో చేరని చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు వర్కర్లు, హెల్పర్లను కొత్తగా నియమించేందుకు ఈ నెల 24, 25వ తేదీల్లో నోటిఫికేషన్లు జారీ చేసేందుకు పలు జిల్లాల కలెక్టర్లు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. గర్భిణిలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహార పంపిణీ, అత్యవసర సేవలకు అవరోధం లేకుండా ఈమేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు.

24న బంద్‌కు పిలుపు

అంగన్‌వాడీల పేరుతో కొన్ని రాజకీయ పక్షాలు, యూనియన్లు తలపెట్టిన ఛలో విజయవాడ విఫలం కావడంతో ఈ నెల 24వతేదీన రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. అందుకు వామపక్ష పార్టీలతోపాటు టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం గమనార్హం. బంద్‌కు అనుకూలంగా విజయవాడలో మంగళవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సీపీఎం ప్రకటించింది. అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి సమ్మె విరమణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది.

ఆ నష్టాన్ని కేసీఆర్ ఫ్యామిలీనే భరించాలి

- కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు
- భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో కేసీఆర్, జగదీశ్‌రెడ్డికి వాటా
- ప్రభాకరరావును అడ్డుపెట్టుకుని విద్యుత్ శాఖలో అవినీతికి పాల్పడ్డారు
- ఉచిత విద్యుత్ అమలు చేస్తాం.. సందేహం వద్దు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, రామగిరి(నల్లగొండ): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు కూలి రూ.లక్ష కోట్లు వృథా అయ్యాయని, ఆ నష్టాన్ని మాజీ సీఎం కేసీఆర్ కుటుంబమే భరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ప్రజలు లేఖలు రాయాలని ఆయన పిలుపునిచ్చారు. నాణ్యత లేకపోవడం వల్లే పిల్లర్లు కూలి రూ.లక్ష కోట్ల నష్టం జరిగిందన్నారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పాల్గొన్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం కమీషన్ల కోసం నిర్మించారని ఆరోపించారు. ప్రజలు కరెంట్ బిల్లులు కట్టొద్దని కేటీఆర్ అనడం సిగ్గుచేటన్నారు. ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేద్దామని భావించామని, కానీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చూస్తే రూ.80 వేల కోట్ల అప్పుల్లో విద్యుత్ శాఖ ఉందన్న వాస్తవం తేలిందన్నారు. ప్రభాకర్‌రావును పెట్టుకుని అవినీతికి పాల్పడి విద్యుత్ శాఖను అప్పుల పాలు చేయడం వల్ల నేడు జీతాలు కూడా ఇచ్చే పరిస్థితిలో లేదని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు నిఖార్సయిన ఐఏఎస్ అధికారి రిజ్వీని నియమించామని, ఇప్పుడిప్పుడే విద్యుత్ శాఖ గాడిన పడుతోందని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తామని అందులో ఎలాంటి సందేహం లేదనీ మంత్రి భరోసానిచ్చారు.

అవినీతిపరులు జైలుకెళ్లక తప్పదు

యాదాద్రి పవర్ ప్లాంట్ రూ.29 వేల కోట్లకు డిజైన్ చేస్తే ప్రస్తుతం రూ.50 వేల కోట్లకు పెరిగిందని అది నామినేషన్ పద్ధతిన ఇచ్చి దండుకున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. మిషన్ భగీరథలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరుగబోతోందని, అవినీతిపరులు జైలుకు వెళ్లక తప్పదని ఆయన హెచ్చరించారు.

మూడేళ్లలో సొరంగ మార్గం పూర్తి..

మూడేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గంతోపాటు బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఎఎమ్మార్పీ ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీ లైనింగ్ కోసం రూ.500 కోట్లు మంజూరు చేయించామని, పనులు పూర్తయితే మరో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. నాడు బీఆర్‌ఎస్ పాలనలో ప్రగతి భవన్‌కు మంత్రులు కూడా వెళ్లే అవకాశం ఉండేది కాదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలు దగ్గరుండి మరీ ప్రజాదర్బార్ ద్వారా సామాన్యుల నుంచి వినతులు స్వీకరిస్తున్నారని చెప్పారు. గత బీఆర్‌ఎస్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఇదే తేడా అని ఆయన వ్యాఖ్యానించారు.

భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో రూ.10 వేల కోట్ల కుంభకోణం

భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో సగం వాటా కేసీఆర్ కుటుంబానిదైతే, సగం వాటా జగదీష్‌రెడ్డిదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తిప్పర్తి మండలం జొన్నలగడ్డ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో రూ.10వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న జగదీష్‌రెడ్డి యాదాద్రి పవర్ ప్లాంట్ అంచనా విలువను రూ.29వేల నుంచి రూ.54 వేలకు పెంచారని నిందించారు. మంత్రి పదవి చేపట్టకముందు ఏమీ లేని జగదీష్‌రెడ్డికి వందల ఎకరాల భూమి, కోట్ల రూపాయల భవనాలు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ కుటుంబం, జగదీష్‌రెడ్డితో సహా సగం మంది జైలుకు పోవడం ఖాయమన్నారు. ఆరు నెలల్లో తమ ప్రభుత్వం కూలబోతుందని కేటీఆర్ కలలు కంటున్నాడని ఆయన ఎద్దేవా చేశారు.

సరికొత్తగా రైతు వేదికలు

అందుబాటులోకి వీడియో కాన్ఫరెన్స్‌లు

- తొలి విడతగా 110 వేదికల్లో
- ఆ తర్వాత అన్ని వేదికల్లోనూ ఏర్పాటు
- రైతులకు నేరుగా శాస్త్రవేత్తల సూచనలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ కీలక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు చాలాచోట్ల నిర్వహణాలోపంతో కునారిల్లుతున్న వాటిని కూడా రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు వాటిని ఆధునీకరించేందుకు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా ప్రతీ జిల్లాలోని కొన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను తీసుకువచ్చారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికల్లో అందుబాటులోకి తెచ్చారు. తదుపరి విడతల వారీగా అన్ని రైతు వేదికల్లో ఈ వీడియో కాన్ఫరెన్స్ సేవలను విస్తరిస్తారు. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు వివిధ దశల్లో రైతులతో నేరుగా మాట్లాడి సూచనలు సలహాలు ఇస్తారు. పంటలను ఆశించే చీడ పీడలను శాస్త్రవేత్తలకు వివరిస్తారు. ఉన్నతాధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా రైతులతో సమావేశమై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలపై అవగాహన కల్పిస్తారు. మంత్రులు సైతం నేరుగా రైతులతో మాట్లాడుతారు. రైతులు కూడా తమ సమస్యలను నేరుగా విన్నవించుకునే అవకాశం కల్పిస్తారు.

ఒక్కో వేదికకు రూ. 3.72లక్షలతో వీసీ సౌకర్యం

అన్నదాతలకు సాగులో సూచనలు ఇచ్చేందుకు 2,642 రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో వేదిక నిర్మాణానికి రూ.22 లక్షలు వెచ్చించారు. ఇందులో రూ.12 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా... మిగతా రూ.10 లక్షలు ఉపాధి హామీ పథకం నిధుల నుంచి ఇచ్చారు. మొత్తంగా అన్నింటికీ కలిపి రూ.572 కోట్లు ఖర్చు చేశారు. అయితే నిర్వహణా లోపంతో రైతు వేదికల లక్ష్యం నీరుగారిపోతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని మరింత ఆధునీకరించాలని నిర్ణయించింది. రైతులకు, ప్రభుత్వానికి మధ్య సంధానంగా ఇవి ఉండేలా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఒక్కో రైతు వేదికకు రూ.3.72 లక్షలు ఖర్చు చేసి వీడియో కాన్ఫరెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తోంది.

రైతు వేదికలు ఇక ప్రజావేదికలు...

రైతు వేదికలను ఇకపై ప్రజావేదికలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులందరినీ రైతు వేదికల వద్దకు పిలిపించి వారికి అవగాహన కల్పిస్తారు. ఆ మేరకు మండల అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు రైతు వేదికల వద్ద నానో యూరియా అమ్మకాలు జరపాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఆ మేరకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వ్యవసాయశాఖకు గతంలోనే ప్రతిపాదనలు పంపింది. కానీ వ్యవసాయశాఖ మాత్రం ఈ ప్రతిపాదనకు అంత సుముఖంగా లేదనీ, ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు.



దావోస్ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్

జిల్లా వార్తలు

అర్హులందరికీ పథకాలు అందాలి

గిరిజన దర్బార్‌లో పీఓ ప్రతీక్‌జైన్



దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులందరికీ అందేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం యూనిట్ అధికారులతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలని.. ఆపై అర్హులకు పథకాలు వర్తింపజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు ఆర్.శ్రీనివాస్, ఉదయ్‌భాస్కర్, మునీర్‌పాషా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి పామాయిల్ ఫ్యాక్టరీకి సెలవులు

దమ్మపేట: వార్షిక మరమ్మతుల నేపథ్యాన పామాయిల్ ఫ్యాక్టరీకి ఈ నెల 25వ తేదీ నుంచి సెలవులు ప్రకటిస్తున్నట్లు దమ్మపేట మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఫ్యాక్టరీకి గెలలు తక్కువగా వస్తున్న కారణంగా మరమ్మతులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించి రైతులు ఆయిల్‌పామ్ గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తీసుకెళ్లాలని సూచించారు.

కేటీపీఎస్ 7వ దశలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

పాల్వంచ: పాల్వంచ మండలంలోని కేటీపీఎస్ ఏడో దశలో సాంకేతిక సమస్యల కారణంగా సోమవారం విద్యుత్ ఉత్పత్తి నిలిచింది. బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12వ యూనిట్‌లో అధికారులు ఉత్పత్తిని నిలిపివేశారు. అనంతరం సీఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. కాగా, సోమవారం అర్ధరాత్రి లేదా మంగళవారం తెల్లవారుజాము వరకు ఉత్పత్తి అందుబాటులోకి వచ్చే అవకాశముందని సమాచారం.

దళారులను ఆశ్రయించకండి

- అర్హులైతే తప్పక అన్‌ఫిట్ చేస్తాం
- సింగరేణి సీఎండీ బలరామ్



విజిలెన్స్, ఏసీబీ అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారు దళారులను ఆశ్రయించొద్దని, అర్హులైతే తప్పక అన్‌ఫిట్ చేసి వారసులకు అవకాశం కల్పిస్తామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడించారు. ఈ నెల 19, 20వ తేదీల్లో నిర్వహించిన మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్, సింగరేణి విజిలెన్స్ జీఎం ప్రసాద్‌రావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం, దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు ఏసీబీకి బాధ్యతలు అప్పగించామని తెలిపారు. తాజాగా జరిగిన మెడికల్ బోర్డుకు 196 మంది దరఖాస్తు చేసుకోగా హాజరైన వారిలో 62 శాతం ఇన్‌వాలిడేషన్ అయ్యారని పేర్కొన్నారు. కాగా, మెడికల్ బోర్డు పారదర్శకంగా జరుగుతుందనే నమ్మకం కార్మికుల్లో కలిగించేందుకు గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మేరకు కార్మికులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మెడికల్ ఇన్‌వాలిడేషన్ విషయంలో ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ బలరామ్ ఆదేశించారు. ఈ విషయమై ఆస్పత్రి ఆవరణలో నిఘా పెంచినట్లు తెలిపారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు బిగించి ప్రధాన కార్యాలయం ద్వారా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. దళారులను ప్రోత్సహించినా, వారితో మాట్లాడినా సిబ్బందిపై చర్యలు ఉంటాయని సీఎండీ హెచ్చరించారు.

భద్రాచలాన్ని టెంపుల్ సిటీగా తీర్చిదిద్దాలి

- ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించండి
- బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి, పక్కన నాయకులు

చుంచుపల్లి: దక్షిణ అయోధ్యగా విలసిల్లుతున్న భద్రాచలం పట్టణాన్ని టెంపుల్ సిటీగా తీర్చిదిద్దేలా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి సూచించారు. కొత్తగూడెంలో బీజేపీ జిల్లా కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాముడు తెలంగాణలో ఉంటే, ఆస్తులు ఆంధ్రాలో ఉన్నందున వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. గతంలో ఏపీలో కలిపిన జీపీలను తిరిగి తీసుకొచ్చేందుకు యత్నిస్తే కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. కాగా, ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి మంత్రి పదవులు దక్కడాన్ని అరుదైన అవకాశంగా భావించి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఇక జిల్లాలోని ప్రాజెక్టుల్లో గత ప్రభుత్వం పాల్పడిన అవినీతిపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఇక ప్రధాని నరేంద్రమోదీ సారథ్యాన అయోధ్యలో భవ్య రామమందిరం నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ఠాపన జరగడం ఆనందంగా ఉందని సుధాకర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ రంగాకిరణ్, ఎడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, నాయకులు శ్రీనివాసరెడ్డి, కుంజా ధర్మా, శ్రీనివాసరావు, బలగాని గోపి, పుణ్యం భిక్షపతి, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, వంశీ, భైరి నిర్మల, కేసుగాని శ్రీనివాస్‌గౌడ్, దోమల మహేశ్, రాయుడు నాగేశ్వరరావు, పైడిపాటి రవీందర్, గొడుగు శ్రీధర్, పసుమర్తి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'హరిత' నిర్మాణం.. నా స్వప్నం

కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు



హోటల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కొత్తగూడెంరూరల్/సింగరేణి(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లెందు క్రాస్ రోడ్డులో హరిత బడ్జెట్ హోటల్ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేయిస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. హోటల్ పనులను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించాక మాట్లాడారు. 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి కేంద్ర టూరిజం శాఖ మంత్రి చిరంజీవికి పలుమార్లు లేఖలు రాసి మంజూరు చేయించానని గుర్తుచేశారు. ఆతర్వాత పనులు మొదలైనా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో పూర్తికాలేదని చెప్పారు. ప్రస్తుతం మరో రూ.3.50 కోట్లు మంజూరైనందున త్వరలో పనులు పూర్తి చేయించి ప్రజలకు అంకితం చేస్తానని కూనంనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కేవీ.ప్రసాద్, ఎంపీడీఓ ఎస్.రమేష్, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘు, సీఐ పెద్దన్న, ఎస్సై సంతోష్, ఆర్ఐలు రాంబాబు, శంకర్‌రావు, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు ఎస్.కే.సాబీర్‌పాషా, తూము చౌదరి, పూనెం శ్రీనివాస్, నూనావత్ గోవిందు, ధనుంజయ్, మిర్యాల రాము పాల్గొన్నారు.

నేడు తెరుచుకోనున్న జిల్లా గ్రంథాలయం



జిల్లా కేంద్ర గ్రంథాలయం

ఖమ్మంగాంధీచౌక్: పది రోజులకు పైగా మూతపడిన జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మంగళవారం నుంచి తెరిచేందుకు అధికారులు అనుమతించారు. గ్రంథాలయ భవనం ఈనెల 12వ తేదీన కూలిపోవడంతో అధికారుల సూచనల మేరకు ఈ భవనానికి ఆనుకుని ఉన్న కేంద్ర గ్రంథాలయాన్ని సైతం మూసివేశారు. ఇన్నాళ్లు కూలిన భవన శిథిలాలే కాకుండా పక్కనే కూలే స్థితిలో ఉన్న భవనం మరో విభాగాన్ని సైతం కూల్చివేసి శిథిలాలు తొలగించారు. ఈ పనులన్నీ పూర్తికావడంతో గ్రంథాలయ కార్యదర్శి మంజువాణి సోమవారం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి పరిస్థితులను వివరించారు. ప్రమాద పరిస్థితులు తొలిగిపోయినట్లు నిర్ధారించుకున్న ఆయన మంగళవారం నుంచి గ్రంథాలయ నిర్వహణ పనులు కేంద్ర గ్రంథాలయంలో చేపట్టడానికి అనుమతించారు.

దర్గాలో బాలరాముడి ప్రతిష్ఠా సంబురాలు



పట్టాభిరాముడికి పూజ చేస్తున్న భక్తులు



జులూస్‌లో పాల్గొన్న భక్తులు, దర్గా మాలిక్

తలంబ్రాలు, ప్రసాదంతో భారీ జులూస్

ఇల్లెందురూరల్: కులమతాలకతీతంగా పూజలు నిర్వహించే ఇల్లెందు మండలంలోని హజ్రత్ నాగుల్‌మీరా దర్గా నిర్వాహకులు మరోసారి అన్ని మతాల సారం ఒక్కటేనని చాటి చెప్పారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దర్గాలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల్‌మీరా దర్గా సన్నిధిలో పట్టాభిరాముడికి భక్తులు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. అనంతరం దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన అయోధ్య నుంచి వచ్చిన తలంబ్రాలు, భక్తులు తయారు చేసిన ప్రసాదాలను వెండి ఊయలలో దర్గా నుంచి సమీపంలోని సత్యనారాయణపురం వీధుల మీదుగా భారీ జులూస్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు స్వాగతం పలికారు. గ్రామంలోని కోదండ రామాలయం వరకు జులూస్ కొనసాగగా, తలంబ్రాలు, ప్రసాదాన్ని పూజల అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

ఏపీకి మారిన డైరెక్టర్ల క్యాంప్



ఏపీలోని అరకులో డైరెక్టర్లు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్ కూరాకుల నాగభూషణంపై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానానికి లేఖ ఇవ్వగా ఈనెల 27న సమావేశం జరగనుంది. ఈమేరకు లేఖ ఇచ్చిన 11మందిలో పది మంది క్యాంపునకు వెళ్లగా వారం పాటు హైదరాబాద్ సమీపంలోని రిసార్ట్‌లో ఉన్నారు. తాజాగా అక్కడి నుంచి ఏపీలోని అరకు లోయ చేరుకున్నారు. ఏపీలోని పలు ప్రాంతాల మీదుగా ఈనెల 27 ఉదయం అవిశ్వాసం సమావేశం మొదలయ్యే సమయానికి సొసైటీ కార్యాలయానికి చేరుకుంటారని తెలిసింది.

నరసింహస్వామిని దర్శించుకున్న ఏపీ ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని కల్పవృక్ష నరసింహస్వామిని ఏపీలోని రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేకు స్వామివారి ప్రసాదంతో పాటు జ్ఞాపికను అర్చకులు అందజేశారు.